సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 26 । జూన్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 31.529 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 92.009 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,270
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,413
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,575
నవర (8 గ్రా) -	రూ.44,600

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.2 /28.0

ఆదివారం గాలిలో తేమ 56 శాతం ఉంది. సోమవారం ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయని. జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

'జగనన్న సురక్ష'లో ఉచితంగా సర్టిఫికెట్లు

• డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



బిరదవోలు ఎస్సీకాలనీలో వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న పీడీ సాంబశివారెడ్డి

పొదలకూరు: 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. మండలంలోని బిరదవోలు, దేగపూడి సచివాలయ పరిధిలో జరుగుతున్న 'జగనన్న సురక్ష' వెరిఫికేషన్లను పీడీ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో శనివారం 93 సచివాలయాల్లో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. జూలై 1న క్యాంపులు నిర్వహించి తహసీల్దార్, ఎంపీడీఓల బృందాలు సర్టిఫికెట్లను అందజేస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను పొందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. పీడీ వెంట ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి, బిరదవోలు, దేగపూడి సర్పంచ్‌లు వెంకటరమణమ్మ, ఓబుల్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

బాలకార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్



కేసులు నమోదు చేసిన అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని చేపలు, చికెన్, మటన్ మార్కెట్లలోని దుకాణాల్లో పనులు చేస్తున్న బాలలను గుర్తించేలా ఆదివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ, సమగ్ర బాలల సంరక్షణ పథకం అధికారులు చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో చికెన్ దుకాణాల్లో పనిచేస్తున్న ఇద్దరు బాలలను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి చైల్డ్ లేబర్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సమగ్ర బాలల సంరక్షణ పథకం అధికారి సురేష్, డీసీఎల్ వెంకటేశ్వర్లు, ఏఎల్ఓ శ్రీహరిబాబు, ఎస్సై శ్రీహరి, పోలీసు, ఎన్జీఓ సిబ్బంది పాల్గొన్నారు.

మిస్టర్ అండ్ మిసెస్ నెల్లూరు-2023 పోటీలు

• ఈ నెల 30న ఆడిషన్స్



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): మిస్టర్ అండ్ మిసెస్ నెల్లూరు - 2023 పోటీల ఆడిషన్స్ ఈ నెల 30వ తేదీన ఇస్కాన్ సిటీలోని హోటల్ మన్మంత్రాలో జరుగుతాయని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌లను నగరంలోని ట్రంకురోడ్డు గాంధీబొమ్మ వద్ద ఉన్న 25 కళాసంఘాల కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్టార్ ఈవెంట్స్ రాజు ఆధ్వర్యంలో గతంలో 'శ్రీమతి నెల్లూరు, మిస్ నెల్లూరు, మిస్ అండ్ మిసెస్ సత్యభామ' పోటీలు విజయవంతంగా నిర్వహించారని, ప్రస్తుతం 'దంపతులకు' పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సత్యంజీ ల్యాండ్ డెవలపర్స్ అధినేత సత్యంజీ మాట్లాడుతూ ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్టార్ ఈవెంట్స్ రాజును అభినందించారు. ఆడిషన్స్‌లో పాల్గొనదలచిన దంపతులు 73580 04184, 98498 64741 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలన్నారు.

సర్వే పరిశీలన



సంగం: సంగం సచివాలయం పరిధిలో ఆదివారం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం సర్వేను డ్వామా పీడీ వెంకట్రావు పరిశీలించారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం లక్ష్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు జగనన్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అశోక్, డీటీ ప్రవీణ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మెట్టకు సాగు సిరులు

వైఎస్సార్ హయాంలో జలయజ్ఞంలో భాగంగా కండలేరు ఎడమగట్టు కాలువ పనులు పూర్తి చేయగా, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అదే కాలువ లైనింగ్ పనులకు నిధులు విడుదల చేసి ఈ ప్రాంత రైతుల సమస్యలు తీర్చారు. ఈ ప్రాంత సాగునీటి కాలువల గురించి స్థానిక ఎమ్మెల్యే అయిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి సీఎం దృష్టి తీసుకెళ్లడంతో కండలేరు ఎడమగట్టు కాలువ లైనింగ్ పనుల కోసం రూ.39.12 కోట్లు మంజూరు చేశారు. సుమారు 22 కి.మీ. మేర లైనింగ్ పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు కూడా పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం పెరగడంతోపాటు అసంపూర్తిగా ఉన్న ఉప కాలువల నిర్మాణం పూర్తయి మెట్ట ప్రాంతంలో పంట సిరులు పండుతాయని రైతులు చెబుతున్నారు.

- కండలేరు ఎడమగట్టు కాలువకు మహర్దశ
- లైనింగ్ పనులకు రూ.39.12 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఉప కాలువల ఆధునికీకరణకు నిధులు
- పనులు పూర్తయితే పెరగనున్న ఆయకట్టు విస్తీర్ణం
- అన్నదాతలకు అండగా ప్రభుత్వం



కండలేరు ఎడమగట్టు కాలువకు చేసిన లైనింగ్ పనులు



కండలేరు ఎడమగట్టు కాలువ హైలెవల్ స్లూయిజ్ (ఫైల్)



పనులకు శంకుస్థాపన చేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

పొదలకూరు: రెండున్నర దశాబ్దాలుగా నిర్మాణానికి నోచుకోని కండలేరు ఎడమగట్టు కాలువ పనులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా 2005లో రూ.40 కోట్లు విడుదల చేసి పనులు పూర్తి చేయించారు. అయితే హైలెవల్ స్లూయిజ్ ద్వారా కాలువకు నీరు విడుదల కావాల్సి ఉండగా కండలేరు జలాశయంలో 35 టీఎంసీల నీటి నిల్వ ఉంటేనే స్లూయిజ్‌కు నీరు అందుతుంది. ఇదే విషయాన్ని అప్పటి జెడ్పీ చైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన ఎత్తిపోతల పథకం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. అప్పట్లో సింగిల్ టెండర్ పడడంతో పనులు రద్దు చేయాల్సి వచ్చింది. తర్వాత లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో జాప్యం జరిగాయి. తెలుగు రాష్ట్రాలు విడిపోయిన అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎత్తిపోతల పథకం పనులు పూర్తయినప్పటికీ ఎత్తిపోతల సక్రమంగా పనిచేయక, లైనింగ్ లేని కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడేవారు. కండలేరు ఎడమగట్టు కాలువకు పొదలకూరు మండలంలోని గ్రామాలతోపాటు చేజర్ల మండలంలోని కొన్ని గ్రామాల్లో 27 కి.మీ. నిడివితో 22 ఉప కాలువలు ఉండగా, వీటి ద్వారా 38 చెరువులకు, డైరెక్ట్ ఆయకట్టు ద్వారా రైతుల భూములకు సాగునీరు అందుతుంది. 20 వేల ఎకరాలకు సాగునీటిని అందించే అవకాశం ఉన్నా ఎత్తిపోతల సక్రమంగా పనిచేయక, లైనింగ్ లేని కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందక అన్నదాతలు అవస్థలు ఎదుర్కొనేవారు.

లైనింగ్ పనులతో రెట్టింపు ఆయకట్టు

కాలువ లైనింగ్ పనులు పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం రెట్టింపయ్యే అవకాశం ఉంది. 20 వేల ఎకరాల ఆయకట్టు 45 వేల ఎకరాలకు పెరుగుతుందని తెలుగుగంగ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం కాలువకు 350 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేసే సామర్థ్యం ఉండగా, లైనింగ్ పనులు పూర్తయితే 455 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుంది. ఈ పనుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.39.12 కోట్ల నిధులు మంజూరు చేయగా, 2021 సెప్టెంబర్‌లో పనులను ప్రారంభించి 65 శాతం పూర్తి చేశారు. సుమారు 22 కి.మీ. మేర లైనింగ్ పనులు పూర్తయ్యాయి. కాగా రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు కాలువ ద్వారా సాగునీరు విడుదల, వేసవిలో మెట్ట పంటల సాగు, పశువుల తాగునీటి కోసం ప్రస్తుతం లైనింగ్ పనులు ఆగి ఉన్నాయి. మిగిలిన పనులు కూడా పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం పెరిగి మెట్ట ప్రాంతంలో పంట సిరులు పండుతాయని రైతులు చెబుతున్నారు.

రైతుల పట్ల చిత్తశుద్ధి



వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వం కనుకనే కాలువ లైనింగ్ పనుల గురించి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సీఎం దృష్టి తీసుకెళ్లిన వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు.

– ఎం.బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, కనుపర్తి

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



లైనింగ్ పనులు పూర్తయితే సాగునీటికి ఇబ్బందులు తలెత్తవు. ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఎన్నో ఏళ్లగా రైతుల కల సాకారం అవుతున్నందుకు సంతోషంగా ఉంది. నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– వై.పెంచలరెడ్డి, ఏఏబీ చైర్మన్, పులికల్లు

పనులు త్వరలో ప్రారంభం

ఆగిన కాలువ లైనింగ్ పనులను త్వరలో ప్రారంభిస్తాం. రైతుల సాగునీటి అవసరాల కోసం పనులను నిలిపివేశాం. సాగునీటి అవసరాలు తీరిన తర్వాత పనులను మొదలుపెడతాం.

– అనిల్‌కుమార్, డీఈ, తెలుగుగంగ

అర్హులకు ధ్రువీకరణ పత్రాలు



వివరాలు తెలుసుకుంటున్న జేసీ కూర్మనాథ్

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): సర్వే బృందానికి వివరాలు తెలియజేస్తే నిర్దేశిత కాలపరిమితిలోపు అర్హులైన ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేయడంతోపాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జేసీ కూర్మనాథ్ తెలిపారు. మండలంలోని చుంచులూరులో జరుగుతున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ఆదివారం జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పలు రెవెన్యూ సమస్యలను ఈ సందర్భంగా స్థానికులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



మహాత్మునికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన, తదితర మతాలకు చెందిన ప్రార్థనలు జరిపారు. తొలుత ఆశ్రమంలోని గాంధీజీ, స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు, నూలు వస్త్రాలు వేసి నివాళులర్పించారు. రాపూరు హైస్కూల్ ఉపాధ్యాయుడు పీవీ శేషయ్య, భాస్కర్ భూషణ్, కోర్ కమిటీ సభ్యురాలు గంపల మంజుల, డైట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనం రాజకీయ చరిత్రను నెల్లూరులోనే ముగిస్తా

- 2024 ఎన్నికల్లో ఇద్దరం నెల్లూరు నగరం నుంచి పోటీ చేద్దాం
- ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- ఆనం రామనారాయణరెడ్డికి సవాల్ విసిరిన నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(బారకాసు): ఆనం రామనారాయణరెడ్డి రాజకీయం ఎక్కడ ప్రారంభించారో అక్కడే ఆయన చరిత్రను ముగించేస్తానని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు టీడీపీ నుంచి టికెట్ తెచ్చుకునే దమ్ము ఆనం రామనారాయణరెడ్డికి ఉందా అని అన్నారు. ఒకవేళ ఆనం టికెట్ తెచ్చుకుంటే.. 2024 ఎన్నికల్లో నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి ఇద్దరం పోటీ చేద్దామని, తాను ఓడిపోతే రాజకీయాల్లో నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ఎమ్మెల్యే అనిల్ తెలిపారు. ఆనం రాజకీయ చరిత్ర ముగిసిపోతున్న తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారని, లేకుంటే ఆయనకు రాజకీయ చరిత్ర ఎక్కడుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాతో గెలుపొందిన ఆనం.. పార్టీకి రాజీనామా చేయకుండా.. ప్రతిపక్ష పార్టీతో కలిసి నడవడం సరికాదన్నారు. తాను ఆనం కుటుంబానికి వ్యతిరేకం కాదని, ఏసీ సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, సంజీవరెడ్డి.. వీరంతా జిల్లాకు ఎంతోకొంత మంచి చేసిన వారు కాబట్టే వారికి మంచిపేరుందని తాను రాజకీయాల్లోకి రాకముందు పెద్దలు చెబుతుంటే విన్నానన్నారు. అదే కుటుంబానికి చెందిన ఆనం విజయకుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరిన తర్వాత అవకాశాలిచ్చినందుకు జగనన్నతో కలిసి పనిచేస్తున్నారని తెలిపారు. ఆనం కుటుంబంలో రామనారాయణరెడ్డి తులసి వనంలో గంజాయి మొక్క లాంటి వారని విమర్శించారు. సవాల్ స్వీకరించే ధైర్యం ఉంటే తన మీద పోటీ చేసి గెలవాలన్నారు.

బీద రవిచంద్రకు కౌంటర్

ఒక్కసారి కూడా ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవని బీద రవిచంద్ర తనపై విమర్శలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. బీద రవిచంద్ర టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆ పార్టీని నాశనం చేశారన్నారు. దగదర్తి మండలంలో మాయమైన భూరికార్డులకు సంబంధించి సమగ్ర చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, బీద రవిచంద్ర చర్చకు వస్తారా అని సవాల్ విసిరారు. నెల్లూరు నగర నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ హయాంలో ఎంత ఖర్చు చేశారో.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నగరాభివృద్ధి కోసం ఎన్ని నిధులు తీసుకొచ్చి తాము ఖర్చు చేశామో ప్రజలకు తెలుసునని, దీనిపై చర్చకు సిద్ధమని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి సవాల్ విసిరారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమమే లక్ష్యం

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సురక్ష కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

దగదర్తి (కావలి): ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలు, సేవలు అందుకోలేని స్థితిలో ఉండిపోరాదన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తిలో ఆదివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆర్డీఓ వీకే శీనానాయక్, తహసీల్దార్ చెంచయ్య, ఎంపీడీఓ విజయకుమార్, సచివాలయాల సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమం విశిష్టతను వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ రకాల వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాల జారీకి వినతులను కూడా సేకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం మొదలవుతుందని, ప్రతి సచివాలయంలో క్యాంపు నిర్వహించి అక్కడికక్కడే పథకాల సమస్యలను పరిష్కరించడంతో పాటు సేవా చార్జీలు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లను అందిస్తారని తెలిపారు. జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, లావాదేవీ మ్యుటేషన్‌లు, ఫోన్ నంబర్‌కు ఆధార్ అనుసంధానం, పంట సాగు కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు వంటి 11 రకాల సర్టిఫికెట్లు సర్వీస్ ఫీజు లేకుండా అంటే ఉచితంగా జారీతో పాటు ఇతర అవసరమైన సర్టిఫికెట్లను కూడా అందించనున్నారని చెప్పారు. నెల రోజుల ఈ కార్యకమం సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కాసుల కక్కుర్తి

కొందరు చేపల, రొయ్యల పెంపకానికి కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రమాదం అని తెలిసినా కాసులు కురిపిస్తుండడంతో అటు వ్యాపారులు, ఇటు మత్స్యశాఖ అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఈ వ్యర్థ్యాలు ఏకంగా సరిహద్దులు దాటి జిల్లాకు వస్తున్నా సంబంధితశాఖ మాత్రం నిమ్మకునీరెత్తినట్లు ఉండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

- వ్యాపారులకు కాసులు కురిపిస్తున్న కోళ్ల వ్యర్థాలు
- ప్రమాదం అని తెలిసినా చేపలకు, రొయ్యలకు ఆహారంగా..
- జిల్లాకు నిత్యం బెంగళూరు, చెన్నై నుంచి 100 కంటైనర్లు
- చిన్న వ్యాన్లలో గుంతల వద్దకు సరఫరా



కంటైనర్‌లోని వ్యర్థాలను చేపల గుంత వద్ద దించుతున్న దృశ్యం(ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో రొయ్యల, చేపల గుంతలను దాదాపుగా 30 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ గుంతల్లో పెంచుతున్న చేపలు, రొయ్యలకు నిత్యం ఆహారం కావాల్సి వస్తోంది. అందుకోసం కొందరు వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. బయట మార్కెట్‌లో చేపలకు, రొయ్యలకు వాడే ఫీడ్‌కు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఆహారం రొయ్యలు, చేపలకు వేస్తే ఆరోగ్యంగానే పెరుగుతాయి. వీటిని తింటే పెద్దగా ప్రమాదం ఉండదు. కానీ వేల రూపాయలు ఫీడ్ కోసం ఖర్చు చేయలేక, వందల రూపాయలకు వచ్చే మాంసపు దుకాణాల్లోని కోళ్ల వ్యర్థాలను వీటికి ఆహారంగా వేస్తున్నారు. వీటిని తింటే మనుషులకు ప్రమాదం అని తెలిసినా రొయ్యలు, చేపల గుంతల నిర్వాహకులు మాత్రం కాసులే పరమావధిగా ఈ వ్యర్థాలను వినియోగిస్తున్నారు.

నిత్యం 100 కంటైనర్లు రాక!

జిల్లాలో రొయ్యలకు, చేపలకు ఆహారంగా వినియోగించే కోళ్ల వ్యర్థాలు బెంగళూరు, చెన్నైల నుంచి నిత్యం 100 కంటైనర్లు వస్తున్నాయని సమాచారం. వీటితోపాటు చిన్న చిన్న వ్యాన్ల ద్వారా కూడా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యర్థాలను ఒక బ్యారెల్ చెన్నై, బెంగళూరులో రూ.1,300 నుంచి రూ.1,400లకు కొనుగోలు చేసి, జిల్లాలో రొయ్యలు, చేపల గుంతల నిర్వాహకులకు రూ.1,800 నుంచి రూ.2 వేలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

అధికారులు మౌనం


ఇతర రాష్ట్రాల నుంచి సరిహద్దులు దాటి జిల్లాకు ప్రమాదకరమైన కోళ్ల వ్యర్థాలు వస్తున్నా అధికారులు మాత్రం తమకు తెలియనట్లు ఉంటున్నారు. మత్స్యశాఖలో కింద నుంచి పైస్థాయి అధికారుల వరకు స్థాయిని బట్టి మామూళ్లు అందుతుండడంతోనే తనిఖీలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాము కూడా ఉన్నామని చెప్పుకునేందుకు ఏదో ఒక రోజు తనిఖీలు చేస్తూ వంద కంటైనర్లు వెళుతుంటే ఒకటో రెండో పట్టుకుని మమ అనిపిస్తున్నారు.

తనిఖీలు చేస్తున్నాం



జిల్లాలో వ్యర్థాలను తరలించే వాహనాలను అప్పుడప్పుడూ తనిఖీ చేస్తున్నాం. కొన్ని వాహనాలను పట్టుకుంటున్నాం. తనిఖీలు ముమ్మరం చేస్తాం. మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి



క్లుప్తంగా

సిమెంట్ ట్యాంకర్ బోల్తా

• అక్కడికక్కడే డ్రైవర్ దుర్మరణం



లారీ డ్రైవర్ మృతదేహం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): సిమెంట్ ట్యాంకర్ బోల్తా పడి డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కదిరినాయుడుపల్లి సమీపంలో 67వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఆదివారం సాయంత్రం కృష్ణపట్నం నుంచి ప్రొద్దుటూరు వైపు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ బోల్తా పడింది. తమిళనాడుకు చెందిన డ్రైవర్ పెరుమాళ్ల స్వామి క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగిన కొద్దిసేపటికి వర్షం మొదలైంది. దీంతో మృతదేహాన్ని బయటికి తీయడం వీలు కాలేదు. మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి సమీపంలోని జేసీబీని పిలిపించి మృతదేహాన్ని వెలికితీసే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

సంగం: విద్యుత్ షాక్‌కు గురై ఎద్దు మృతిచెందిన ఘటన సంగం ఆంజనేయస్వామి గుడి వీధిలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సంగం తూర్పువీధికి చెందిన శ్రీనివాసులురెడ్డికి ఎద్దుల బండి ఉంది. ఇసుక తోలి జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున తన రెండు ఎద్లను బండికి కట్టుకుని వస్తున్నాడు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి ఆంజనేయస్వామి గుడి సమీపంలో టెలిఫోన్ స్తంభంపై వెళ్తున్న విద్యుత్ వైరు ఇన్సులేషన్ దెబ్బతింది. దీంతో స్తంభానికి విద్యుత్ సరఫరా జరిగింది. ఎడ్లబండికి ఎడమ వైపునున్న ఎద్దు తోక జాడించడంతో స్తంభానికి తగిలి ఒక్కసారిగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. బండి నడుపుతున్న శ్రీనివాసులు సైతం షాక్‌కు గురయ్యాడు. రూ.లక్ష విలువైన ఎద్దు మృత్యువాతపడడంతో జీవనాధారం కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు సంగం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన నెల్లూరు నగరంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రంగనాయకులపేటకు చెందిన షేక్ అల్లాభక్షు (35)కు జెండావీధికి చెందిన ఆయేషాతో 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇద్దరు కుమార్తెలున్నారు. ప్రస్తుతం వారు ఖుద్దూస్‌నగర్‌లో ఉంటున్నారు. అల్లాభక్షు కార్పెంటర్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోసాగాడు. ఇటీవల అల్లాభక్షు పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటుండడంతో ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. ఈ విషయమై దంపతుల నడుమ విభేదాలు వచ్చాయి. ఈ నెల 24వ తేదీ శనివారం సాయంత్రం ఏమి జరిగిందో తెలియదు గానీ అల్లాభక్షు తన ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఆయేషా తమ్ముడు గమనించి అల్లాభక్షు తల్లి రషీదా వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని తెలియజేశాడు. కాగా ఆయేషా మరో తమ్ముడితో కలిసి అల్లాభక్షును కిందకు దించి చికిత్స నిమిత్తం రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందాడని నిర్ధారించారు. ఆస్పత్రికి చేరుకున్న రషీదా కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా రోదించింది. శనివారం అర్ధరాత్రి చిన్నబజారు ఎస్సై సైదులు హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని విచారించి తగిన చర్యలు తీసుకోవాలని రషీదా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 143
లేయర్ (లైవ్)	: 108
బ్రాయిలర్ చికెన్	: 244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 272
లేయర్ చికెన్	: 184



నిమ్మధరలు పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ. 30
సన్నవి	: రూ.18
పండ్లు	: రూ. 5



ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ,
రెవెన్యూ కాలనీ, దర్గామిట్ట, శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా 524004

ఆర్.సి.నెం. Spl/ఎ2/2023 తేది: 25.06.2023

షార్ట్ టెండర్ నోటీసు

ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వారి ఆధీనములో నడుపబడుచున్న 12 ఐ.సి.డి.యస్ ప్రాజెక్టుల యందు గల లబ్ధిదారులకు YSR సంపూర్ణ పోషణ పథకము ద్వారా అందించు పదార్థములు ఇవ్వుటకు నిర్దేశిత కొలతల ప్రకారము సంచులు సరఫరా చేయుటకు జిల్లా కొనుగోలు కమిటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు వారిచే షార్ట్ టెండర్లు కోరబడుచున్నవి. తేది. 26.06.2023 నుండి తేది. 28.06.2023 సా. 5.00 గం॥ లోపు టెండరు దాఖలు చేయవలెను. వివరములు జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మరియు సాధికారత అధికారి వారి కార్యాలయము, నెల్లూరు జిల్లా వారిని సంప్రదించగలరు.

జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మరియు సాధికారత అధికారి శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

సంయుక్త కలెక్టర్ శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

జైల్లో స్నేహం.. రెండు జిల్లాల్లో చోరీలు

• ముగ్గురు ఘరానా దొంగలపై పలు కేసులు
• గతంలో జైలుకు పంపినా మారని తీరు
• దర్యాప్తులో వెలుగులోకి అనేక విషయాలు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): ఆ ముగ్గురూ పాతనేరస్తులు. జైల్లో ఉండగా స్నేహితులయ్యారు. విడుదలైన తర్వాత బృందంగా ఏర్పడ్డారు. తాళాలు వేసిన ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడసాగారు. సొత్తుతో జల్సాలు చేస్తూ పోలీసుల కళ్లుగప్పి తిరగసాగారు. ముగ్గురు ఘరానా దొంగలను నెల్లూరు సీసీఎస్, కావలి రూరల్ పోలీసుల ప్రత్యేక బృందం శనివారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పోలీసుల దర్యాప్తులో నిందితులపై అనేక కేసులున్నట్లు వెలుగు చూసింది. వారి కథనం మేరకు..

బేల్దారి పని నుంచి..

ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి గ్రామానికి చెందిన షేక్ గౌస్‌బాషా అలియాస్ గుడ్డి గౌస్ ప్రస్తుతం నెల్లూరు నగరంలోని సుందరయ్యకాలనీలో నివాసం ఉంటున్నాడు. మొదట్లో బేల్దారి పనులు చేసేవాడు. వ్యసనాలకు బానిసైన అతను దొంగగా మారాడు. ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, కొడవలూరు, కోవూరు, సంగం, బుచ్చి, నెల్లూరు రూరల్, నెల్లూరు నగరంలోని వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ల పరిధిలో గౌస్‌పై దొంగతనం కేసులున్నాయి. ఈ క్రమంలోనే వేదాయపాళెం పోలీసులు సస్పెక్టెడ్ షీట్ తెరిచారు. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినా మారలేదు. యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతూనే ఉన్నాడు. రెండో భార్య హత్య కేసులో ఈ ఏడాది జనవరిలో ముత్తుకూరు పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

మిల్లులో పనిచేస్తూ..

నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువ సెంటర్‌కు చెందిన ఎల్.రాంబాబు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా. అతను కొంతకాలం క్రితం నెల్లూరుకు వచ్చాడు. రూరల్ మండల పరిధిలోని రైస్‌మిల్లులో పనిచేస్తూ నేరాలకు పాల్పడసాగాడు. నెల్లూరు రూరల్, బాలాజీ నగర్, ముత్తుకూరు, ఇందుకూరుపేట, తిరుపతి జిల్లా చిల్లకూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కి జైలుపాలయ్యాడు. నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్లో సస్పెక్టెడ్ షీట్ ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బాలాజీ నగర్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దోచుకెళ్లిన ఘటనలో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

పరిచయమిలా..

గౌస్‌బాషా, రాంబాబుకు జైల్లో పరిచయమైంది. అలాగే ఓ హత్య కేసులో జీవితఖైదు పడడంతో జిల్లా కేంద్ర కారాగారంలో జైలు జీవితం అనుభవిస్తున్న మార్కాపురం పట్టణానికి చెందిన ఆర్.తిరుపతయ్యతో రాంబాబుకు పరిచయమైంది. ఈ నేపథ్యంలో ముగ్గురూ స్నేహితులయ్యారు. తిరుపతయ్యపై మార్కాపురం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఫిబ్రవరిలో జైలు నుంచి బయటకు వచ్చారు. బృందంగా ఏర్పడి ఈ ఏడాది మే, జూన్ నెలల్లో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు.

నిందితుల గుర్తింపు ఇలా..

వరుస దొంగతనాలపై ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్పీ డి.హిమవతి పర్యవేక్షణలో సీసీఎస్ డీఎస్పీ ఎ.శివాజీరాజు ఆధ్వర్యంలో సీసీఎస్, కావలి రూరల్ ఇన్‌స్పెక్టర్లు బి.రమేష్‌బాబు, ఎం.రాజేష్ తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఘటనా స్థలాల్లో లభ్యమైన ఆధారాలతో నిందితులను గుర్తించి వారి కోసం విస్తృతంగా గాలించారు. కావలి రూరల్ మండలం ముసునూరు గ్రామం జాతీయ రహదారి సమీపంలో శనివారం అరెస్ట్ చేశారు. రూ.13.80 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

దొంగతనాలు ఇక్కడే..

- నెల్లూరు రూరల్ మండలం జన్నత్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన షేక్ షబ్బీర్ నరుకూరు సెంటర్‌లో బంగారు ఆభరణాల విక్రయ దుకాణం నిర్వహిస్తున్నాడు. నిందితులు ఈ ఏడాది మేలో దుకాణం తాళాలు పగులగొట్టి అందులో ఉన్న ఆరు కేజీల వెండి, రూ.50 వేల విలువ చేసే బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.
- మే నెలలో కావలి రూరల్ మండలం ముసునూరు గ్రామంలో సతీష్ అనే వ్యక్తి ఇంట్లో 74 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు కాళ్లపట్టీలను అపహరించారు. ఈ ఘటనపై కావలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.
- బాలాజీనగర్‌లో జ్యోతిలత అనే మహిళ ఇంట్లో 40 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదు దొంగతనం చేశారు.
- ఈనెల మొదటి వారంలో మార్కాపురం పట్టణంలోని ఓ ఇంట్లో 20 తులాల బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.
- గౌస్‌బాషా గతేడాది కొడవలూరు మండలంలో రఫీ అనే వ్యక్తి ఇంట్లో మూడు సవర్ల బంగారు ఆభరణాలు అపహరించాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆత్మకూరులో ముమ్మరంగా అభివృద్ధి పనులు



సాతానుపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కరటంపాడు సచివాలయం పరిధిలో సాతానుపల్లి, శ్రీనివాసపురం, రామాపురం గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంజీఆర్ ఫౌండేషన్ సహకారంతో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. తమ కుటుంబం తరఫున రూ.10 కోట్లను ఇప్పటికే ఏడీఎఫ్‌కు కేటాయించామన్నారు. రూ.4.50 కోట్ల వ్యయంతో ఆత్మకూరులోని నిర్మించిన బస్‌స్టేషన్‌ను ప్రజలకు అంకితం చేశామన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వేలాదిమంది హాజరై జయప్రదం చేశారని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రూ.కోటి విరాళం

ఇటీవల ఆత్మకూరుకు చెందిన మాజీ శాసనసభ్యుడు తన వంతుగా రూ.కోటి విరాళం ఏడీఎఫ్‌కి కేటాయించారని విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఇంకా పలువురు పారిశ్రామికవేత్తలు ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకొస్తున్నారని తెలిపారు. తన సోదరుడు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుతో అభివృద్ధికి కార్యక్రమాలు శ్రీకారం చుడతామన్నారు. కాగా జగనన్న సురక్ష పథకం సర్వే సందర్భంగా ప్రజలు తమ వివరాలు నమోదు చేసుకుని టోకెన్ పొందాలని, తద్వారా సచివాలయాల స్థాయిలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఎలాంటి రుసుం లేకుండానే లబ్ధిదారులకు అందిస్తారన్నారు. ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలోనూ రూ.కోట్లతో పనులు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కరటంపాడు సచివాలయం పరిధిలో నాలుగేళ్లలో రూ.15 కోట్లను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందించారని తెలిపారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని బలపరచాలని కోరారు. ఆత్మకూరులో మేక పాటి గౌతమ్‌రెడ్డి బస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి వేలాదిమందికిపైగా ప్రజలు హాజరవడం ప్రభుత్వం, మేకపాటి కుటుంబం పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు తహసీల్దార్ లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టమూరు జితేంద్రనాగ్ రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్రనాయుడు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు శరత్ చంద్ర, నయోమితోపాటు సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ కో–ఆర్డినేటర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బడిలో చేర్పించేందుకు కృషి చేయాలి

• యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నెల్లూరు(టౌన్): విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు తెలిపారు. నెల్లూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలీనం పేరుతో పాఠశాలలను కుదించడం వల్ల విద్యార్థుల నమోదు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. జీఓ నంబర్ 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. అనంతరం సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ మాట్లాడుతూ పోరాట కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు, కోశాధికారి మురళీధర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీదేవి, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, ఆడిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కేంద్ర సహకార బ్యాంక్‌కు బీ గ్రేడ్



నెల్లూరులోని డీసీసీబీ ప్రధాన పరిపాలన కార్యాలయం

• గత ఆర్థిక సంవత్సరంలో రూ.480 కోట్ల మేర డిపాజిట్ల సేకరణ
• 1.65 లక్షల మంది డిపాజిటర్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) గ్రేడ్ మారింది. 2023 సంవత్సరం మార్చి 31వ తేదీ నాటికి 1.65 లక్షల మంది డిపాజిటర్లను కలిగి ఉంది. డిపాజిట్ల ద్వారా రూ.480 కోట్లను సేకరించి అభివృద్ధిపథంలో సాగుతోంది. ఇందులో కరెంట్, సేవింగ్ డిపాజిట్ల రూపంలోనే రూ.140 కోట్లు సేకరించడం విశేషం. అదే విధంగా రూ.1,500 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించి సీ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్ స్థాయికి ఎదిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించి ఏ గ్రేడ్‌కి చేరుకునేందుకు బ్యాంక్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వ్యాపార లావాదేవీలు అధికంగా చేపట్టాలి. అందులో డిపాజిట్ల సేకరణే ప్రధానమైన అంశం.


20 బ్రాంచ్‌లు

డీసీసీబీకి ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 20 బ్రాంచ్‌లున్నాయి. 183 మంది సిబ్బంది ఉన్నారు. వీరు నిత్యం రైతులకు, డిపాజిట్‌దారులకు మెరుగైన సేవలందిస్తున్నారు. జిల్లాలో బ్యాంక్ విస్తరణలో భాగంగా జలదంకి, ముత్తుకూరు, బిట్రగుంట, ఏఎస్‌పేట మండలాల్లో నూతన బ్రాంచ్‌లను త్వరలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా కొత్తూరు, పెళ్లకూరు, రాజుపాళెం, వెంకటాచలం, దుత్తలూరు, డక్కిలి, తడ ప్రాంతాల్లో నూతనంగా బ్యాంక్ శాఖల ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. డిపాజిటర్ల కోసం నూతన పథకాలను అమల్లోకి చేస్తూ ఏ ఇతర వాణిజ్య బ్యాంక్‌లు ఇవ్వని విధంగా కొన్ని డిపాజిట్లపై అధిక శాతం వడ్డీని బ్యాంక్ ఇస్తోంది. సేవింగ్ అకౌంట్ డిపాజిటర్లకు రెండు సంవత్సరాల పైబడి కాలపరిమితిపై అధికంగా 7.50 శాతం వడ్డీని ఇస్తోంది. సీనియర్ సిటిజన్లకు (60 సంవత్సరాలు పైబడి) వారి డిపాజిట్లపై 8 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్ల (80 సంవత్సరాలు పైబడి) కోసం డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీని డీసీసీబీ అందిస్తోంది.

ఉద్యోగుల సంఖ్యను పెంచుకునేలా..

బ్యాంక్ గ్రేడ్ పరంగా సీ నుంచి బీకి వృద్ధి సాధించింది. దీంతో అదనంగా మరో 100 మంది ఉద్యోగులను నియమించుకునే వీలు కలిగింది. అదే విధంగా బ్యాంక్ రూ.3 వేల కోట్ల టర్నోవర్ సాధించి 'ఏ' గ్రేడ్‌కు చేరుకుంటే అదనంగా మరో 150 మంది సిబ్బందిని నియమించుకునే వీలు కలుగుతుంది. దీంతో డీసీసీబీ ద్వారా జిల్లా రైతులు, డిపాజిట్‌దారులకు మరింత మెరుగైన సేవలందించే అవకాశముంది.

డిపాజిట్ల సేకరణకు కృషి



డీసీసీబీ ద్వారా రూ.వెయ్యి కోట్ల డిపాజిట్లను సేకరించేలా లక్ష్యాన్ని పెట్టుకోవడం జరిగింది. నాలుగు సంవత్సరాల నుంచి బ్యాంక్ డిపాజిట్లు, టర్నోవర్ పెరుగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్ల టర్నోవర్ సాధించి బ్యాంక్‌ను 'ఏ 'గ్రేడ్ లో నిలపాలన్నదే ప్రధాన లక్ష్యం. దీనికోసం బ్యాంక్ చైర్మన్, పాలక మండలి సభ్యులతో కలిసి పటిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తున్నాం.

– డాక్టర్ శంకర్‌బాబు, డీసీసీబీ సీఈఓ

తీర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధిపై సర్వే



వాటంబేడు కుప్పంలో పులికాట్ తీరం వద్ద అధ్యయన బృందం

తడ: తీర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు అటవీ శాఖకు చెందిన అధ్యయన బృందం ఆదివారం రామాపురం నుంచి వాటంబేడు వరకు సర్వే చేసింది. టూరిజం అధికారి శ్రీనివాసులు, మత్స్య కళాశాలకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ అనూప, కోట ఎఫ్‌డీఓ రెడ్డినాయక్, స్థానిక పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలసి సర్వే చేశారు. తీర ప్రాంతాలోల టూరిజం అభివృద్ధి జరిగితే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని టూరిజం అధికారి శ్రీనివాస్ తెలిపారు. జాలర్ల కుప్పాల్లో పర్యటించిన ఈ బృందానికి స్థానిక జాలర్ల సంఘాల నాయకులు తడలో కె.ఆర్ముగం, వాటంబేడులో బి.వరప్రసాద్ సహకారం అందజేశారు.

29న కోనలో తొలి ఏకాదశి వేడుకలు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఈనెల 29వ తేదీన తొలి ఏకాదశి వేడకలను నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు ఆదివారం తెలిపారు. ఆ రోజున శ్రీమన్నారాయణుడు యోగనిద్రకు ఉపక్రమించారని, అందుకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి అంతరాలయంలో ఉత్సవ మూర్తిని పాల సముద్రంలో యోగనిద్రలో ఉన్నట్లుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■ **Last Chance:** 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry.9381287629 [T-4390]

REAL ESTATE

■ నెల్లూరు వెంకటాచలం హైవేకి నుడ అప్రూవల్ వెంచర్ నందు 50 శాతం కట్టిన వారికి స్పాట్ రిజిస్ట్రేషన్ కలదు. 36 నెలలు. 22వేలు EMI కలదు. బ్యాంక్ లోన్ కలదు. 89198 65981. [NA-10831]

HOUS FOR SALE

■ నెల్లూరు రైల్వేస్టేషన్‌కు 8కి.మీ. దూరంలో నరుకూరు సెంటర్‌కు అతి సమీపంలో 22 అం॥ స్థలంలో 13 అం॥ ఇల్లు కట్టి 35 లక్షలకే అమ్మబడును. 62814 11178, 91214 52347. [NA-5717]

■ నెల్లూరు - మైపాడురోడ్డు మెయిన్ రోడ్డుకి 22 అం॥ స్థలం, 18 అం॥ కట్టుబడి ఇల్లు కట్టించి ఇవ్వబడును. రేటు : 39.9 లక్షలు. నివాసయోగ్యం ప్రశాంత వాతావరణం. సెల్ : 63004 37419 [NA-22239]

PLOT FOR SALE

■ నెల్లూరు నుండి 9km దూరంలో జగదేవిపేట నందు మెయిన్‌రోడ్డుకి 36 అం॥ స్థలం 6 అం॥ ఫాంహౌస్ with స్విమ్మింగ్‌పూల్, ప్లే ఏరియా వసతులతో స్థలం అమ్మబడును. 70362 31356. [NA-22240]

SERVICES

BUSINESS OFFER

■ శ్రీ గాయత్రి మిని గీజర్స్ (5 sec.లో వేడి నీళ్ళు) సేల్స్ చేయుటకు డీలర్స్ కావలెను. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం. సంప్ర. సెల్ : 96663 32323, 95506 92836. [M-1221206]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2404]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781985]

■ వివిధ తాకట్టు సంస్థలు, బ్యాంకుల నుండి బంగారు నగలు విడిపించి అమ్మి రొక్కం ఇప్పించబడును. బంగారు నగలు హోల్‌సేల్ రిటైల్‌తో సరఫరా చేయబడును. ఫోన్: 77290 47122 [V- 6167]

WANTED

■ **Wanted Telecallers, Sales Executives** & Surveyors. Fixed Salary Rs.15,000/-. Contact : 91828 26279, 73825 00035. [N-1189318]

■ **Wanted Pre Primary Teachers and up** to 7th Class Maths & Science Teachers. Contact : Vidya Vikas E.M.H.S, Neelagiri Sangam, NLR-3. Cell : 94929 34271. [N-785349]

■ **Lotus Group Wanted Accountants** - Degree with 3 yrs Tally exp. Store Keepers, Sale, Marketing Executives & Cashiers. 7995655576, 7995655580.Time:10am-5pm [NA-3888]

■ **Wanted Lady Teachers for Pre Primary,** SpokenEnglish, Residential Maths/ Science (1to7) PET Teachers & Wardens. Sankar School,USPet. 94416 85767, 94935 13489. [NA-22245]

■ **Wanted Teachers English for Primary** Physics for 6th to 9th. Contact: Sri Medha English Medium School, Pedda Bazaar, Nellore. Cell : 93980 19296. [NA-22260]

■ **Wanted Teachers to Teach Telugu,** English, Social For High School & Primary Maths. We provide Accomodation. SRMD BVN, Ravur. Further Details Contact : 96184 52123. [NA-22261]

■ వ్యవసాయ ఉత్పాదనాలు మార్కెటింగ్ చేయుటకు ప్రతి మండలానికి ఒక్క వ్యక్తి చొప్పున కావలెను. జీతం: 20వేలు (TA+DA), విద్యార్హత: 10th to డిగ్రీ. సెల్: 83108 61934. [N-785263]

■ కోవూరు బుజబుజ నెల్లూరు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ కంపెనీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. వివరాలకు సంప్రదించండి. 99484 25418. [N-1231431]

■ కావలి నలంద E.M. హైస్కూలు నందు పనిచేయుటకు వార్డెన్లు కావలెను. అర్హత : 10th / ఇంటర్. జీతం : 10వేలు, ఉచిత భోజన వసతి కల్పించబడును. 8790027909, 9493914693 [N-1189536]

■ ఇంటర్ లేక డిగ్రీ చదివిన లేడి (Female) రిసెప్షనిస్ట్ నెల్లూరు పొగతోటలోని హాస్పిటల్‌లో పని చేయుటకు కావలెను. వివరాలకు సంప్రదించండి. 0861-2325488. [NA-1598]

■ మా ఆఫీసు నందు పని చేయుటకు టెలి కాలర్స్, కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన ఆఫీస్ ఇన్‌చార్జ్, ప్యాకింగ్ చేయుటకు లేడీస్ కావలెను. సంప్ర. 76590 40542, 77020 59133. [NA-10332]

■ అమ్మ రియల్ ఎస్టేట్ ఆఫీస్ నందు GM, AGM మార్కెటింగ్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్, టీం లీడర్స్, PRO, CRO, టెలికాలర్స్, రిసెప్షన్ కావలెను. జీతం : 10000 - 50000 + కమీషన్ Ph. 8919865981 [NA-10330]

■ బ్యాంక్ లోన్స్ ప్రాసెస్ నందు TeleCaller కావలెను. Married female, టార్గెట్స్ లేవు. జీతం: 12000/-. ట్రంక్ రోడ్, నెల్లూరు. వివరాలకు సంప్రదించండి : 88858 02000. [NA-22217]

■ Walk in Interview. Sai Marine Exports pvt ltdనెల్లూరు,నారాయణరెడ్డిపేటవద్దపనిచేయుటకు అడ్మిన్,HR, ప్రొడక్షన్ సూపర్‌వైజర్స్, రిఫ్రిజిరేషన్, ఎలక్ట్రికల్, మెకానికల్ కావలెను. నేరుగా సంప్ర॥ [NA-22249]

■ నెల్లూరులోని ప్రముఖ షోరూమ్‌లో పని చేయుటకు 10, ఇంటర్, డిగ్రీ చదివిన యువతీ యువకులు కావలెను. ఫోటోషాప్ అనుభవం లేకున్నా శిక్షణ ఇచ్చి ఉద్యోగం. 93471 17849. [NA-11470]

■ నెల్లూరు టౌన్ నందు మ్యారేజ్ బ్యూరోలో ఆఫీసు స్టాఫ్‌గా పనిచేయుటకు వివాహిత మహిళలు కావలయును 10 వ తరగతికి పైన చదివి వుండాలి ఇంగ్లీషు చదువుట రాయుట వచ్చి వుండాలి. 9491219494 [NA-22235]

■ నెల్లూరు, మాగుంట లేఔట్‌లోని క్లాసిక్ మార్కెటింగ్ టైల్స్ & శానిటరీ వేర్ షోరూంలో పనిచేయుటకు డిగ్రీ / బి.టెక్ / MBA అర్హత కలిగిన సేల్స్ గర్ల్స్ & బాయ్స్ కావలెను. 6301281399, 9491271139 [NA-22242]

■ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో Onrole Jobs కలవు. ఆకర్షనీయమైన జీతం. Qua: ఏదైనా డిగ్రీ. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత. ✆ 9440351657 [T-1148678]

■ ప్రముఖ ఇంటర్నెట్ సంస్థ నెల్లూరు, విజయవాడ, వైజాగ్ నందు ఫీల్డ్ వర్క్ చేయుటకు వర్కర్స్ కావలెను. అర్హత:9th-10th,ITI, ఇంటర్, శాలరీ : 10k-15k. 6300950372, 9115456456 [G-785777]

■ తిరుమల, తిరుపతి నందు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకు Attender, House Keeping Supervisor,House keeping Staff, Electricians అర్జెంట్‌గా కావలెను. 9000775715. [T-4383]

■ గ్లోబల్ కంపెనీలో డిజిటల్‌గా వర్క్ చేస్తూ నెలకు 35,000/- వరకు సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు లేవు. సంప్ర : 79956 36002 [V- 797203]

■ ప్రముఖ కాఫీ పరిశ్రమలో ప్యాకింగ్ చేయుటకు ఆడవారు & మగవారు, వంట మాస్టర్లు, డ్రైవర్లు, ఆఫీసు బాయ్స్, క్యాంటీన్ హెల్పర్స్ అర్జెంటుగా కావలెను. ✆ 92980 11777, 81427 61777. [B-786378]

■ మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221323]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/ పురుషులు కావలెను,ఆయా, వార్డ్ బాయ్స్,నర్సులు, వంటవారు, RMP Dr. Q:5th-Degree, 10-30 వేల జీతం, భో+రూం ఫ్రీ. Hyd. ఫోన్: 7995984445. [HA-340]

■ బ్యాంక్‌లలో (ఆఫీస్ వర్క్) పర్మినెంట్‌గా Q: 10th- డిగ్రీ జీ॥ 26,000/- కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ @Ph: 8332809093 [H-781446]

■ నెల్లూరు పట్టణంలో అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ మరియు టెలికాలర్స్ అమ్మాయిలు కావలెను. జీతం: సెక్యూరిటీ 12,000/-, టెలికాలర్స్-13,000/-, Time: 9-5, ఆదివారం సెలవు. ఫోన్: 6300661014. [HA-249]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K హైదరాబాద్ : 9640258899, విజయవాడ: 9640648899 [HA-337]

■ చిత్తూరు శ్రీ సిటీ నందు పనిచేయుటకు Supervisors మరియు ITI ట్రైనీస్ కావలెను. మంచి సాలరీ మరియు ESI, PFతో పాటు ఉత్తమ ఎదుగుదల అవకాశములుగల వాతావరణంలో పనిచేయుటకు సంప్రదించగలరు. ఫోన్ : 9030143545, 7799955402 [HA-248]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.